తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# కాణిపాకం బ్రహ్మోత్సవాలకు సీఎం జగన్‌కు ఆహ్వానం



సీఎం జగన్‌కు స్వామివారి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న



కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తూ గురువారం దేవస్థానం తరపున ఆహ్వానపత్రాలను అందజేశారు. దేవస్థానంలో ఈనెల 18 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 21 రోజుల పాటు జరుగనున్నాయి. ఈఉత్సవాలకు సీఎంను ఆహ్వా నిస్తూ ఆహ్వాన పత్రాలను అందజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డిలు విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాల యంలో కలసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అలాగే దేవస్థానం తరపున వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం, జనసేన పొత్తు ఖారారు!

**- రాజమండ్రి జైలులో చంద్రబాబు నాయుడును కలిసిన అనంతరం ప్రకటించిన జనసేనాని పవన్‌కళ్యాణ్ - ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4 స్థానాలపై జనసేన నేతల ఆశలు - 19వ తేదీ అనంతరం ఇరు పార్టీల ఉమ్మడి కార్యాచరణ**




చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: ఇప్పటి వరకు ఎన్డీఓ భాగస్వామ్య పక్షాలతో వున్న జనసేన ఒక్క సారిగా ప్లేటు ఫిరాయించింది. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న ఎన్నికల్లో జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీతో కలిసి పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. రాజమండ్రి జైలులో వున్న జాతీయ తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడును గురువారం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కలిశారు. చంద్రబాబు నాయుడుతో మిలాఖత్ అనంతరం జనసేనాని పవన్ కళ్యాణ్ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో జనసేన కలిసి పని చేస్తోందని ప్రకటించారు. జరుగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేతతో పాటు బిజెపిని సైతం కలిసి పోటీ చేసేలా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో జనసేనతో పొత్తు తప్పనిసరిగా వుంటుందని ఇప్పటికే నిర్ణయించిన తెలుగుదేశం పార్టీ ఈ మేరకు కొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికీ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను సైతం నియమించలేదు. తెలుగుదేశం పార్టీతో ప్రస్తుతం జనసేన జట్టు కట్టడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేనకు నాలుగు కంటే ఎక్కువ స్థానాలు కేటాయించాలని జనసేన పార్టీ నాయకుల డిమాండ్ తెరపైకి వచ్చింది. ఎన్నికల్లో జనసేన పొత్తును దృష్టిలో వుంచుకొని తెలుగుదేశం పార్టీ ఇప్పటి వరకు చిత్తూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిని నియమించలేదు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా వుండటంతో ఈ స్థానం నుండి ఆ సామాజిక వర్గంకు చెందిన వారికి అవకాశం ఇవ్వాలని తెలుగుదేశం నిర్ణయించింది. ప్రస్తుతం ఈ స్థానంను జనసేనకు కేటాయిస్తే ఆ సామాజిక వర్గంకు చెందిన అభ్యర్థి ఎన్నికల బరిలో వుండే అవకాశం వుంటుంది. అలాగే తిరుపతి, మదనపల్లి, శ్రీకాహహస్తితో పాటు మరొక నియోజకవర్గం జనసేన పార్టీకి కేటాయించాలని ఆ పార్టీ నేతల నుండి ఇప్పటికే డిమాండ్లు తెరపైకి వచ్చేశాయి. అయితే తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య పొత్తులు కుదిరినప్పటికీ రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీ జనసేనకు ఎన్ని స్థానాలు ఇవ్వడానికి సిద్ధపడుతుంది! ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో జనసేనకు తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పిస్తుందనే విషయంపై ప్రస్తుతం స్పష్టత లేదు. ఎన్నికల పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ జనసేనకు పట్టు వుండే ఉత్తరాంధ్రా ప్రాంతంలో అధిక మొత్తంలో పోటీ చేయడానికి స్థానాలు కేటాయించి, రాయలసీమలో పోటీ చేయడానికి తక్కువ స్థానాలు కేటాయిస్తే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేనకు కేటాయించే స్థానాల సంఖ్య తక్కువ అయ్యే అవకాశం కన్పిస్తుంది. అలాగే ప్రస్తుతం ఇరు పార్టీల మధ్య పొత్తుకు గ్రీన్‌సిగ్నల్ లభించడంతో ఈ నెల 19వ తేదీ అనంతరం తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడి కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్ళనున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు సమన్వయ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. నాలుగు స్థానాల కంటే ఎక్కువ స్థానాలు తమ పార్టీకి కేటాయించాలని అప్పుడే జనసేన నాయకులు తెరపైకి తీసుకువచ్చారు.

# సిఎం రాక కోసం ఏర్పాటు చేపట్టాలి: కలెక్టర్



పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 18,19వ తేదీల్లో జిల్లాకు రాక కోసం ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో జిల్లాకలెక్టర్ సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేసారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ నెల 18న తిరుమల శ్రీ వారికి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని, ఈ సందర్భంగా తిరుపతి, తిరుమలలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని అన్నారు. అనంతరం మార్కెట్ యార్డు వద్ద శ్రీనివాస సేతు ప్రారంభించి, టిటిడి ఉద్యోగులకు ఇంటి పట్టాలు మంజూరు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం తాతయ్యగుంట గంగమ్మ తల్లిని దర్శించుకుని తిరుమల చేరుకుని గెస్ట్ హౌస్‌లను ప్రారంభించి శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకుంటారు. అనంతరం రాత్రి శ్రీ వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ఈ నెల 19న మరో మారు తిరుమల శ్రీ వారిని దర్శించుకుని తిరుగుప్రయాణం కానున్నారని అన్నారు. పర్యటన రహదారుల్లో బారికేడ్స్ ఏర్పాటు, భద్రత వంటివి పగడ్బందీగా వుండాలన్నారు. ఈ సమీక్షలో నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, అడిషనల్ ఎస్‌పి కులశేఖర్, డిఆర్‌ఓ పెంచలకిషోర్, ఆర్డిఓలు కిరణ్ కుమార్, చంద్రముని, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జగన్ జాగ్రత్త..ప్రజలు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉంది

**-మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మీ**



సత్యవేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : అధికార పార్టీ అరాచక పాలనతో ప్రజలు విసిగియారని కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ అన్నారు. తేదేపా అధినేత చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ ఇన్‌ఛార్జ్ హెలెన్ ఆధ్వర్యంలో రెండవ రోజు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా శిక్షణ పొందిన 85వేల మందికి చంద్రబాబు హయాంలో ఉద్యోగాలు రావడం జరిగిందన్నారు. అవినీతి ఎక్కడ జరిగిందంటూ ప్రశ్నించారు. అధికార పార్టీ రాజకీయ కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ఆధారాలు లేని కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తుంద న్నారు. జగన్ జాగ్రత్త..ప్రజలు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందంటూ ఆమె హెచ్చరించారు. అధేవిధంగా తేదేపా నేత జేడి రాజశేఖర్ తమవర్గం నేతలతో కలిసి సత్యవేడులో మరోవైపు నిరసన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేలమత, జిల్లా అధ్యక్ష్యుడు నరసింహ యాదవ్,యుగంధర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఎస్ఆర్ మేరకు ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన పూర్తి : జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో ఎస్ఎస్ఆర్ 2024 మేరకు ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎస్ఎస్ఆర్ పై ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించాలనే అంశం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1732448 ఓటర్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగిందని, ఈ నెల 18 వరకు ఆన్‌లైన్ అప్ డేట్ కొరకు ఎన్నికల కమిషన్ ఈ నెల 18 వరకు అవకాశం కల్పించిందని పూర్తి చేస్తామని వివరించారు. జీరో డోర్ నెంబర్లు పూర్తి స్థాయిలో సరిచేస్తున్నామని, ఆదర్శ, పారదర్శక జాబితా సిద్ధం చేయడమే లక్ష్యమన్నారు. డూప్లికేట్ తొలగింపుకు ఎన్నికల కమిషన్ త్వరలో సాఫ్ట్ వేర్ అందించనున్నదని అందులో ఫోటో సిమిలర్, డేమోగ్రఫికల్ విధానంలో తొలగనున్నాయని వాటికి సరైన ఆధారాలు పరిశీలించి చర్యలు చేపట్టనున్నామని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతి నిధులు ఫిర్యాదులను పూర్తి వివరాలతో ఇవ్వగలిగితే క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నామని తెలిపారు. ఈ నెల 20న జరిగే సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి ప్రతిపాదనలు ఎన్నికల కమిషన్‌కు పంపనున్నామని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్ ప్రచురణ అనంతరం కూడా క్లైములు స్వీకరించనున్నామని వివరించారు. ఈ సమీక్ష లో నగరపాలక కమిషనర్ హరిత, డిఆర్‌ఓ పెంచల కిషోర్, ఇఆర్‌ఓలు కనకనరసారెడ్డి, కోదండరామిరెడ్డి, చంద్రముని, కిరణ్ కుమార్, ఎన్నికల తహశీల్దార్ రమేష్, ఎఇఆర్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సిపిఎం నాగరాజు, మురళి, వైసిపి చంద్రమోహన్ రెడ్డి, కాంగ్రెస్ రవి, టిడిపి సుధారెడ్డి పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో పని చేయని ఎసిలు

**-పట్టించుకోని ఇంజనీరింగ్ అధికారులు**



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం పని తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారింది, భక్తుల నుంచి ముక్కు పిండి ఓ వైపు దేవస్థానం మరో వైపు దళారులు దోచుకుంటున్నారు. గత కొంత కాలంగా ఆలయంలో ఎసిల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆలయంలో పరిస్థితి గమనిస్తే భక్తుల సౌకర్యార్థం వారి సదుపాయాలకు సంబంధించి పట్టించుకునే దిక్కులేదు. ఇక ఆలయాధికారులు ఈ రోజు రాహుకేతుదోష నివారణ పూజల ద్వారా ఆలయానికి ఎంత ఆదాయం వచ్చింది. మధ్యవర్తులకు టిక్కెట్ల రూపంలో ఎంత వచ్చింది.అనే పరిశీలనలు తప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? అని పట్టించుకునే దిక్కులేదు. ఆలయాన్ని పర్యవేక్షించే ఎఇఒలు, ఇన్స్పెక్టర్లు కూడా పట్టించుకోరు.

**పనిచేయని ఎసిలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేసవి కాలంను మించి ఎండ వేధిస్తుంది. కొంత కాలంగా ఎసిలుపని చేయటం లేదు. ఫ్యాన్లు పని చేస్తే చేయవచ్చు లేకుంటే లేదు. ముఖ్యంగా రూ.500ల,రూ.750, రూ.1500ల మండ పాల్లో ఎసిలు పని చేయటం లేదు. ఇక స్వామి,అమ్మవారి అంతరాల యంలో ఎసిలు పని చేయటం లేదు. అయితే వీటి మరమ్మతుల బాధ్యత ను నాయకులు పట్టణానికి చెందిన ఓ ఎలక్ట్రానిక్ షాపు నిర్వహించే పార్టీ అనుచరునికి అప్పగించారు. ఆతను బిల్లులు తీసుకోవటం తప్ప ఎసిలను మరమ్మతులు చేసి భక్తులకు సదుపాయాలు కల్పించాలనే దిశగా పని చేయటం లేదు.దాంతో భక్తులు చెమట కార్చుకుంటున్నారు.ఈ సమస్య అధికారులు, సిబ్బందికి తెలియదా? అంటే తెలియక కాదు. ఇది మాసమస్య కాదు కదా అనే విధంగా భావిస్తున్నారు.మరి ఎసిలు బాగు చేస్తారా? లేక రాబోయేది వర్షాకాలం కదా అని వదలిపెడతారో అధికారులకే ఎరుక

## బ్రహ్మోత్సవాల్లో... భక్తులు సంతోషించేలా ఏర్పాట్లు

**-వాహనసేవల వీక్షణకు గ్యాలరీల్లో సకల సదుపాయాలు -గరుడసేవరోజు సంతృప్తికర వాహనదర్శనం**



తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి: దేవదేవుడు తిరుమల వేంకటేశ్వరస్వామికి మూడురోజుల్లో ప్రారంభమవుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు సౌకర్యవంతంగా వాహన సేవల వీక్షణకు వీలుగా గ్యాలరీలు ఏర్పాటు జరిగిందని,సదుపాయాలు కల్పిస్తున్నామని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. ప్రతి భక్తుడు వాహనసేవలు దర్శించుకుని సంతృప్తిచెందేలా సౌలభ్యంగా ప్రవేశ,నిష్క్రమణ ద్వారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా ఐదవరోజురాత్రి (సెప్టెంబర్ 22న శుక్రవారం)జరిగే గరుడవాహనసేవ వీక్షణకు తరలివచ్చే లక్షలాదిమంది భక్తులు సాఫీగా స్వామిని దర్శించుకునేందుకు మరింత అదనపు ఏర్పాట్లు ఉంటాయన్నారు. గరుడసేవ దర్శనం కోసం ఆ రోజు పూర్తిగా ఇన్నర్‌రింగ్‌రోడ్డు, ఔటర్‌రింగురోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, దక్షిణమాఢవీధి కార్నర్, గోవిందనిలయం ఉత్తరపశ్చిమగేట్, తూర్పుమాడ వీధి గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతిస్తామన్నారు. గరుడ వాహనాన్ని రాత్రి 7గంటలకు ప్రారంభించి ప్రతి భక్తుడు ప్రశాంతంగా స్వామివారి సేవను వీక్షించేలా అర్ధరాత్రి 2గంటల వరకైనా నెమ్మదిగా ముందుకు తీసుకెళతామని ఇఒ ధర్మారెడ్డి వెల్లడించారు. ఏర్పాట్లపై అధికారులతో కలసి తనిఖీలు చేపట్టారు.

**రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్‌చే...**

## అలిపిరి కాలిబాట మార్గాన్ని పరిశీలన



కాలిబాట మార్గాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, ముగ్గురు సభ్యులు గొండు సీతారాం, త్రివర్ణ ఆదిలక్ష్మి, బత్తుల పద్మావతిలు గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, అటవీ శాఖ సిబ్బంది, పోలీస్ నిఘా విభాగం అధికారులు, రక్షక సిబ్బందితో కలిసి అలిపిరి కాలి నడక ద్వారా చిరుత బారిన పడి దాడికి గురైన కౌశిక్, చిరుత పులి దాడికి బలై ప్రాణాలు కోల్పోయిన చిన్నారి లక్షిత మృత్యువాత పడిన ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించి జరిగిన సంఘటన పై ఆరా తీశారు. దీనిపై సంబంధిత అధికారులతో సమావేశమై పరిశీలించిన విషయాలను చర్చించారు. వీటిపై కమిషన్ చైర్మన్, సభ్యులు నివేదికకు సమర్పించడం జరుగుతుందని భవిష్యత్‌లో ఇటేవంటివి పునరా వృతం కాకుండా తదుపరి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, చర్యలకు సిఫార్సు లను చేయడం జరుగుతుందన్నారు. అలిపిరి కాలిబాటలో బాలకార్మికులను గుర్తించడం జరిగిందని వారిని వ్యాపార వృత్తుల్లో నియమిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తిరుమలలో బాల్య వివాహాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, బాలలను బిక్షాటన చేయకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ వసంత, సభ్యులు రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సంరక్షణ విభాగం అధికారి శివశంకర్, సిబ్బంది మురళి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో డబుల్ డెక్కర్ బస్సులు తిరిగేలా రోడ్డు విస్తరణ



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త : తిరుపతిలో డబుల్ డెక్కర్ బస్సు తిరిగేలా రోడ్ల విస్తరణ చేసామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ పేర్కొన్నారు. గురువారం తిరుపతికి వచ్చిన డబుల్ డెక్కర్ బస్సును గంగమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తిరుమల శ్రీ వారు, తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి కరుణా కటాక్షాలతో తిరు పతిలో ప్రజా రవాణా వ్యవస్థ మరో అడుగు ముందుకేసిందని తెలిపారు. దక్షిణ భారతదేశంలో హైదరా బాద్ తర్వాత డబుల్ డెక్కర్ బస్సు అందుబాటులో ఉన్న ఏకైక నగరంగా తిరుపతి చరిత్ర డబుల్ డెక్కర్ బస్సు అందుబాటులో ఉన్న ఏకైక నగరంగా తిరుపతి చరిత్ర సృష్టించిందన్నారు. అవసరాలను బట్టి భవిష్యత్తులో మరిన్ని డబుల్ డెక్కర్‌లను అందుబాటులో తెచ్చేందుకు పరిశీలిస్తున్నామన్నారు. ఏడాదిన్నర కిందట ఆటోలు తిరగడమే కష్టంగా మారిన ఇరుకైన రోడ్లను ఈ రోజు డబుల్ డెక్కర్‌బస్సులు తిరిగే స్థాయికి విస్తరించామ న్నారు. తిరుపతి నగరంలోని రోడ్లకు అనుసంధానిస్తూ అదనంగా మరో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను, పెద్ద ఎత్తున ఫ్రీ లెఫ్ట్ రోడ్లును నిర్మించడం జరిగిందని అభినయ్‌రెడ్డి తెలిపారు.

## 'బాబు'తోనే మేము !

**-రెండవరోజూ విజయవంతంగా టిడిపి రిలేనిరాహార దీక్షలు**

తిరుపతి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: సుదీర్ఘకాలం రాష్ట్రముఖ్యమంత్రిగా, హుందాతనంతో పాలన సాగించిన టిడిపి అధినేత,మాజీ సిఎం చంద్రబాబు నాయుడుతోనే మేముంటామని తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్ళ వైసిపి పాలనలో, సిఎం జగన్ నియంతలా వ్యవహరించి అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే అని చెబుతూ ప్రశ్నించిన వారిని కేసులతో భయపెట్టడం అలవాటు చేసుకున్నారన్నారు. అక్రమంగా కేసుల్లో ఇరికించి జైలుకు పంపిన చంద్రబాబు నిజాయితీగా బయటకు వస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు. చంద్రబాబుకు మద్దతుగా, నీతోనే బాబు, నియంత పాలనపై పోరాటం పేరుతో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం రెండవరోజు యధావిధిగా సాగింది. సాయంత్రం 5గంటల వరకు చేపట్టిన ఈ దీక్షలకు ఆటో యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ దీక్షల్లో తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, రాష్ట్రకమిటీ నాయకులు సూరాసుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతియాదవ్, మబ్బుదేవ నారాయణరెడ్డి, పులిగోరు మురళి, జెబి శ్రీనివాసులు, బిజి కృష్ణయాదవ్, పనబాక లక్ష్మి, విజయలక్ష్మి,వట్టికుంట శంకరనారాయణ, ఊకా విజయ కుమార్, దంపూరి భాస్కర్, కంకణాల రజినీకాంత్‌నాయుడు, బుల్లెట్‌రమణ, కుమారమ్మ, మౌలా.రాజుయాదవ్ తదితరులు నల్లదుస్తులు ధరించి భారీసంఖ్యలో రిలేనిరాహారదీక్షల్లో పాల్గొన్నారు



# సంక్షేమం కావాలంటే వైసిపిని ఆదరించండి : మంత్రి రోజా



విజయపురం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు మరింతగా కొనసాగాలంటే ప్రజలు వైసిపి ప్రభుత్వాన్ని ఆదరించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా కోరారు. గురువారం మండలంలోని జంబాడలో గడప గడపకు మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఆమె పాల్గొని సంక్షేమ పథకాలు తెలిపే కరపత్రాలను ఇంటింటికీ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం 90 శాతం నెరవేర్చిందని తెలిపారు. టిడిపి హయాంలో సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి వుండేదని తెలిపారు. ప్రస్తుతం వాలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు గడప దాటకుండా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, తహశీల్దారు వెంకట్రాయలు, వైస్ ఎంపిపి బాలాజీ, మండల వైసిపి అధ్యక్షుడు గోపినాదజ్, సర్పంచ్ భాస్కర్‌రాజు, నాయకులు సుబ్బు, సతీష్‌యాదవ్, నారపరాజు, శేఖర్‌రాజు, ప్రసన్నకుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు

**-సర్వాంగ సుందరంగా ముస్తాబైన వెంకన్న ఆలయం -గోడలపై ఆకర్షిస్తున్న దేవతామూర్తుల చిత్రాలు -దే దీప్యమానంగా విద్యుత్ వెలుగులు -ఈ నెల 17న అంకుర్పార్పణ, 22న గరుడ వాహన సేవ -ఉత్సవ ఏర్పాట్లనే పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి**

తిరుపతిరూరల్, సెప్టెంబర్14 ప్రభాతవార్త: తిరుమల తరహాలో తుమ్మల గుంటలో వెలసిన శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వాహణకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఆలయ పరిసరాలు అన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబు కావడంతో పాటు, గోడలపై దేవతా మూర్తుల ప్రతిమలను ముద్రించడం, రంగు రంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది.

**-బ్రహ్మోత్సవాలకు 17న అంకురార్పణ**

తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వర స్వామి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈనెల 17వ తేదీన అంకురార్పణ చేయనున్నారు. 18న ధ్వజారోహణ, పెద్ద శేష వాహనంతో వాహన సేవలు ప్రారంభం కానున్నాయి. 22న గరుడు సేవ, 26న చక్ర స్నానం నిర్వహించనున్నారు. ఇప్పటికే స్వామి దేవరులతో కలిసి ఊరేగే వాహనాలను సిద్ధం చేసారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా శ్రీకళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.



## చంద్రబాబు విడుదలయ్యేదాకా పోరాటం ఆపేది లేదు

– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు జైలునుంచి విడుదల అయ్యేదాకా పోరాటం ఆపేది లేదని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలను కొనసాగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం కుట్రతోనే చంద్రబాబును జైలుకు పంపిందన్నారు. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని చంద్రబాబు ఆకాంక్షించారని అలాంటి వ్యక్తిపై నేరాలు మోపడం దారుణమని ప్రజలే పేర్కొంటున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపాను ప్రజలు గట్టిగా బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మణి,బగ్గిడి వెంకటేష్, పద్మ, చంద్రకళ, శకుంతల, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన స్కూల్ గేమ్స్ పోటీలు

**శాంతిపురం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

మండల స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14,17 పోటీలు గురువారం మఠం స్కూల్ మైదానంలో ప్రారంభమ య్యాయి. తొలిరోజు వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలను బాలబాలికలకు నిర్వహించారు. శుక్రవారం ఖోఖో, త్రోబాల్, బాల్ బాడ్మింటన్, యోగా పోటీలు జరుగుతాయని ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు. 16న అన్ని విభాగాల పోటీలు జరుగుతాయన్నారు.

## మేలైన యాజమాన్య పద్ధతిలో పొలంబడి

**శాంతిపురం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



మండలంలోని బందపల్లి గ్రామంలో ఎఓ అపోజి అధ్వర్యంలో చలపతి అనే రైతు పొలంలో పొలంబడి కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారికి పంట యాజమాన్యం, విత్తనశుద్ధి, విత్తన మోతాదు, ఎరువుల యాజమాన్యం తదితరాల గురించి రైతులకు శిక్షణ కల్పించారు. ఎఫ్‌పిఒల సహకారంతో పంటలను ఇతర దేశాల్లో ఉపయోగిం చేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విఎస్ఎ నరేష్, రైతులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి!

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

కుప్పం పట్టణం కోర్టు వీధిలో నివాసం ఉన్న వెంకటపతి అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేశారు.

## తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

**వి.కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



స్థానిక మండల కార్యాలయంలో ఎంపిపి యువరాజు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. సమావేశంలో ప్రజాసమస్యలపై చర్చించేవారు లేకపోయారు. అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో హాజరయ్యారు. అయితే సమావేశానికి ప్రజాప్రతినిధులు కానివారు సైతం హాజరు కావడం గమనార్హం. మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు హాజరయ్యారు. అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. సమావేశంలో జడ్పీచైర్మన్ శ్రీనివాసులు, వైస్ ఎంపిపిలు తమీమ్, లక్ష్మణ్‌రెడ్డి, ఎంపిడిఒ మహేష్, తహశీల్దార్ చిట్టిబాబు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలిని అటకాయించి చైను చోరీ!

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

మండలంలోని బంగానత్తం పాఠశాలలో పనిచేస్తున్న ఉమామహేశ్వరి అనే ఉపాధ్యాయురాలు తన చైనును గుర్తు తెలియని ఓ మహిళ, ఓ వ్యక్తి చైన్ స్నాచింగ్‌కు పాల్పడి దోచుకెళ్లినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం మధ్యాహ్నం విధులు ముగించుకుని స్కూటీలో వస్తుండగా చందం గ్రామం వద్ద ఓ మహిళ తన వాహనంను ఆపిందని అంతలోనే ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి తన మెడలో ఉన్న 36గ్రాముల బంగారు చైను లాక్కొన్నట్లు పేర్కొంది. అనంతరం వారిద్దరూ పరారయ్యారన్నారు. ఈ మేరకు తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొంది.

## ఘనంగా హిందీ భాషా దినోత్సవం

**పాలసముద్రం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:**

పాలసముద్రం మండలం కృష్ణజిమ్మాపురం పంచాయతీ ఎస్ఆర్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ మనోహర్‌నాయుడు మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ పరిషత్‌లో హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నరాజు, రఘు, ఏలుమలై, పుష్పలత, శంకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాళ్ళపల్లెలో నూతన పింఛన్లు పంపిణీ

**వెదురుకుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



మండలంలోని పెరుమాళ్ళపల్లె సచివాలయంలో గురువారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారు లకు అంజేశారు. పెరుమాళ్ళపల్లె సచివాల యం పరిధిలోని పెరుమాళ్ళపల్లె, మారేపల్లె,గొడుగుచింత పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బండి శశిఆనంద రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చి మాట ప్రకారం అర్హులైన ప్రతి లబ్ధిదారులకు పింఛన్ అంజేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొడుగుచింత సర్పంచ్ నక్క బాబు, మారేపల్లె సర్పంచ్ అన్నూరాశి, డీడీవో ధనలక్ష్మి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద రెడ్డి, పరందామ రెడ్డి, షణ్ముగం రెడ్డి, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగుతున్న రిలేనిరాహారదీక్ష

**వెదురుకుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



తెలుగు దేశం పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గం కేంద్రంలో నిర్వహిస్తున్న రిలే నిరాహదీక్షను రెండవ రోజు తెలుగు తమ్ముళ్ళు కొనసాగించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా టీడీపీ కార్యదర్శి మోహన్ మురళి మాట్లాడుతూ బాబుగారికి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం అండగా ఉంటామనిస్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు గుండయ్య, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బియం,రవి, పెద్ద సంఖ్యలో నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

## బాబు కోసం ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

**బంగారుపాళ్యం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:**



టీడీపీ అధినేత నారా చంద్రబ ాబునాయుడు కోసం గురువారం టీడీపీ నాయకులు బంగారుపాళ్యంలోని ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సైకో ముఖ్యమంత్రి జగన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కోకా ప్రకాష్‌నాయుడు, శివకుమార్, కృష్ణకుమారి, సుదర్శన్ నాయుడు, రమేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం..అభివృద్ధి సిఎం జగనన్నకే సాధ్యం

– ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

**కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



రాష్ట్ర అభివృద్ధి,ప్రజల సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నా రు. గురువారం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ నేతృత్వంలో పట్టణంలోని 17వ వార్డులో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కలిగిన లబ్ధిని వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్సీ భరత్, ఛైర్మన్ డా॥ సుధీర్‌లకు కౌన్సిలర్ రంగయ్య, మహిళలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, సలహాదారు ఆర్. శ్రీనివాసులు, మైనార్టీ అధ్యక్షుడు సర్దార్, నేతలు మురళి, మోహన్‌రాం, నిత్యానంద పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఐరాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలు

**ఐరాల, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**



ఐరాల జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండ ల స్థాయి కబడ్డీ, కోకో ఎంపిక పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పాఠశాల హెచ్ఎం కోమల తెలిపారు. ఈఎంపిక పోటీల్లో మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు. అలాగే పొలకల జడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పీడీలు దేవ, సతీష్ నంద, నాగరాజు, శాంతకుమారి, మహారాణి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 'దేశం' నిరసన దీక్షలు

**చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:**

జాతీయ తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ రిమాండ్‌ను నిరసిస్తూ క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహిస్తున్న నిరసన దీక్షలు గురువారం కొనసాగాయి. చిత్తూరు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం కొంగారెడ్డిపల్లిలో జరిగిన నిరసన దీక్షల్లో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా దేశం ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడుపై కక్ష సాధించడానికి అక్రమ కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో సీనియర్ రాజకీయవేత్త అయిన తమ పార్టీ అధినేతపై సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి అక్రమంగా జైలుకు తరలించిందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష

**పాలసముద్రం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:**

ఒఆరోగ్య సమాజ ఆవిష్కరణ కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించతలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను పక్కాగా చేపట్టి పూర్తి చేయాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ గురు వారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై పిహెచ్‌సి డాక్టర్ మోహన్‌కృష్ణ, ఎంఇఓ రాజేంద్రప్రసాద్, పిహెచ్‌సి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్యం కోసం నిర్వహించే హెల్త్ క్యాంపుకు అనారోగ్యంతో వున్న ప్రతి ఒక్కరిని తీసుకువచ్చి వారికి చికిత్స చేయించాల్సిన బాధ్యత వాలంటీర్లు, ఎఎన్ఎంలపై వుందని ఆయన పేర్కొన్నారు.పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మోహన్ కృష్ణ, ఎంఇఓ రాజేంద్రప్రసాద్, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సమన్వయంతో వినాయక చవితి ఉత్సవాలు : కమీషనర్

**చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:**

వినాయక చవితి ఉత్సవాలను మున్సి పల్ కార్పొరేషన్, పోలీసు శాఖ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వ యంతో విధులు నిర్వహించి విజయవంతం చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ వినాయక చవితి అనంతరం జరిగే విగ్రహాల నిమజ్జనం కోసం మూడు రోజుల పాటు మున్సిపల్ కార్పొరేషన్ అన్ని ఏర్పాట్లు చేపడుతుందన్నారు. ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు, కమిటీ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిఎస్పీ శ్రీనివాసమూర్తి వివరించారు. అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఇన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ భారతి, ఎంఇ గోమతి,ఎంహెచ్ఓడాక్టర్‌లోకేష్, సిఎంఎం గోపి, గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు

## ప్రజలకు పక్కాగా వైద్య సేవలు : ఎమ్మెల్యే

**చిత్తూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:**

ప్రజల వద్దకే వెళ్లి వారికి పక్కాగా వైద్య సేవలు అందించడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్షేత్ర స్థాయి సర్వే, క్యాంపుల నిర్వహణ తదితరాలపై గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మురకంబట్టులోని ఆపోలో ఆసుపత్రి ఆడిటోరియంలో మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది, వార్డు సచివాల సిబ్బంది, వాలంటీర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. 15వ తేదీ ఉదయం వాలంటీర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్ళాలన్నారు. ఈ సమావేశంలో చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మర్ రాహుల్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, సిఎంఎం గోపి, కార్పొరేటర్లు, కో-అప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం: నేదురుమల్లి

**బాలాయపల్లి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:**



వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుం దని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అంబలపూడి గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో వైసీపీ అఖండ మెజారిటీతో గెలుస్తుందని, మరలా సీఎం జగన్మోహన్‌రెడ్డి సీఎం అవుతారన్నారు. ఆయన వెంట ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, గోపికృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, ఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు కొత్త గృహాలు మంజూరు చేస్తా : రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:**



పట్టణంలోని 25వ వార్డు కాంపాళెం వద్ద నివాసం ఉంటున్న గిరిజనులకు కొత్త గృహాలు నిర్మించాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 25వ వార్డులో కాంపాళెంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వెంట వైసీపీ జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్లు సుభావళి, నారాయణ, వహీదా, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, సుబ్బారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్లు పంపిణీ చేసిన కౌన్సిలర్

**వెంకటగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:**



పట్టణంలోని 20వ వార్డులో కొత్తగా మంజూరైన పెన్షన్లను కౌన్సిలర్ కొల్లు మల్లీశ్వరి, వైసీపీ నేత కె.సతీష్ పంపిణీ చేశారు. వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు వైసీపీ నేత సతీష్ తెలిపారు.

## కడిగిన ముత్యంలా కేసుల నుండి బయటకు వస్తాడు

**వెంకటగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:**



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసుల నుండి కడిగిన ముత్యం వలె బయటకు వస్తారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య తెలిపారు. ఆయన అరెస్టుకు సంఘీభావంగా వెంకటగిరిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. చంద్రబాబు నాయుడుపై టీడీపీ నేతలపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన భయపడమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే తగు గుణపాఠం చెబుతారన్నారు. 2024 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్య నిర్వాహణ కార్యదర్శి సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, నాయకులు చంద్రమౌళిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న కోసం చండీ యాగం నిర్వహించిన మస్తాన్

**వెంకటగిరి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బెయిల్‌పై జైలు నుండి బయటకు రావాలని డాక్టర్ మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీనియర్ టీడీపీ నేత బొలిగర్ల మస్తాన్ యాదవ్ దంపతులు చండీ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. ఆయన చరిత్రలో ఎప్పుడు అక్రమాలకు పాల్పడలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు శ్రీనివాసులు, రామచంద్రయ్య, చంద్రయ్య నాయుడు, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

**కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక ధారుడ్యంతో పాటు మనోవికాసానికి దోహదం చేస్తాయని తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని చెప్పారు. గురువారం కోట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అండర్ 14, 17 విభాగాలకు సంబంధించి పాఠశాల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మిం టన్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మొబిన్‌బాషా, షంషుద్దిన్, దారా సురేష్, పిఇటిలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

**కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



వినాయక చవితి మండపాలు ఏర్పాటుకు నిర్వాహకులు ముందుగా పోలీసుస్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోట ఎస్ఐ జి.పుల్లారావు కోరారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఐదుగురు అంతకంటే ఎక్కువమంది కమిటీ సభ్యులుగా ఏర్పడి వారి వివరాలు పోలీసుస్టేషన్‌లో తెలిపి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే సౌండ్‌సిస్టం వాడుకోవాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేలా ప్రజలు సహకరించాలని కోరారు.

## వేనాడు దర్గా వద్ద గంధోత్సవం ఏర్పాట్లు

**తడ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



చారిత్రక ప్రసిద్ధి చెందిన తడ మండలం వేనాడు దీవిలో అల్లాతాత దర్గా 28వ గంధ మహోత్సవం ఈ నెల 22న ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి ఈ నెల 16న శనివారం సాయంత్రం నిషాన్ (జెండా స్థాపన) చేస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం ఆసియాలోనే అతిపొడవైన సమాధిపై కప్పారు. గ్రామపెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదిలావుంటే గురువారం అమావాస్య కావడం, గంధ మహోత్సవానికి సమయం దగ్గరపడుతుండటంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి ఇక్కడ నిద్ర చేసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి కూడా భక్తులు విరివిగా రావడంతో వేనాడు మార్గం క్రిక్కిరిసింది.

## ప్రధాని జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

**కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం ఈ నెల 17న జరుపుకుంటామని, ఆ సందర్భంగా ఈ నెల 31వ తేదీ వరకు మండలంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని కోట మండల బిజెపి ఇన్‌ఛార్జ్, తిరుపతి జిల్లా కార్యదర్శి పారిచర్ల బైరప్ప తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల బూత్ స్థాయి నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండల బిజెపి అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు మాట్లాడుతూ కోట మండలంలో బిజెపి పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోట మండల కార్యదర్శి వాసు, ఓబిసి కార్యదర్శి వెంకయ్య గౌడ్, మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మహేష్, దళిత యువమోర్చా నాయకుడు కిషోర్, యువమోర్చా నాయకుడు నికేష్ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఛైర్మన్ పరామర్శ

**పెళ్లకూరు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



పెళ్లకూరు మండలం పెన్నేపల్లి గ్రామానికి చెందిన గోకుతోటి రేవంత్ ఆదివారం రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పెళ్లకూరు ఎంపిపి పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పిటిసి ప్రిస్కిల్లా తదితరులు మృతుని కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాయపాటి వెంకటేశ్వర్లు, పెన్నేపల్లి మాజీ సర్పంచ్ మురళీ, మండల బిజెపి అధ్యక్షుడు గోకుతోటి మురళి, ఇలకా అశోక్ తదితరులు ఉన్నారు.

## సంజీవయ్యను కలిసిన విద్యుత్ శాఖ ఎస్ఇ

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త**



ఎపిఎస్‌పిడిసిఎల్ నెల్లూరు రీజియన్ నూతన సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన వి.విజయన్ గురువారం స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను క్యాంప్ కార్యాలయంలో సంజీవయ్యను కలిసి ఆయన విద్యుత్ శాఖ పనితీరును వివరించారు.

## తడలో ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు

**తడ, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



తడలో రెండోరోజు గురువారం ఎస్‌జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీలలో పలువురు విజేతలుగా నిలిచారు. వాటంబేడు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ఖోఖో పోటీలలో విన్నర్లుగా, అక్కంపేటలోని ఎపిఎంఎస్ స్కూలు విద్యార్థులు రన్నర్లుగా గెలుపొందారు. అండర్-14 కేటగిరిలో అక్కంపేట విద్యార్థులు విన్నర్లుగా, వాటంబేడు విద్యార్థులు రన్నర్లుగా నిలిచారు. వాలీబాల్ పోటీలలో తడ జడ్పీ హైస్కూలు విద్యార్థులు విన్నర్లుగా నిలిచినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ పోటీలు శుక్రవారం కూడా జరుగుతాయన్నారు.

## క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి : ఎమ్మెల్యే

**నాయుడుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



విద్యార్థులు గెలుపోటములను పక్కనపెట్టి క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయు డుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంఇఓ మునిరత్నం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండలస్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే సంజీవయ్య ప్రారంభించారు. క్రీడల్లో భాగంగా టాస్ వేసి కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, ఎంపిపి ధనలక్ష్మిలు విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎన్‌డిసిసిబి మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, నాయకులు పాదర్తి హరినాథరెడ్డి, చదలవాడకుమార్, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి రాహుల్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులు పురోహితులకు ఫల సరుకులు అందజేత

**వాకాడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ, బాపట్ల జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం శ్రావణమాసం సందర్భంగా అద్దంకిలోని శ్రీ వింధ్యా వాసవి సమేత నగరేశ్వరస్వామి దేవస్థానం అర్చకులకు సరకులు అందజేశారు. వేయి స్తంభాల గుడి 30లో 30 మంది అర్చకులు, పురోహితులకు దాత బలరామరెడ్డి ఆర్థిక సౌజన్యంతో లక్ష రూపాయిల ఫల సరుకులు, కూరగాయలు, సంభావన బాపట్ల జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు మేదూరు జానకిరామ్, సంస్థ ప్రతినిధి దీవి అనంతబాబు, ఉమ్మడి ప్రకాశం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఎంవి శ్రీనివాసాచార్యులు చేతులు మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీవి మురళీకృష్ణ, డాక్టర్ మేదూరి గోపి కృష్ణ, వంశీ ప్రియ, శేషాంజలి, గీత, చరణ్, కళ్యాణ్, వేదాంతం సుధాకర్, పరుచూరి హనుమాచార్యులు, చందలూరు శ్రీనివాసరావు, సునీల్ కుమార్, వినుకొండ ఫణి కుమార్, శంకరమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ దివస్

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



జాతీయ స్థాయిలో జాతి సమైక్యతకు హిందీ భాష కీలకమైందని హెచ్ఎం బాబురెడ్డి పేర్కొన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లి యుపి స్కూల్‌లో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఇటుకలతో హిందీ దివస్ అక్షరాకృతిని నిర్మించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, మాధవన్, వాణిశ్రీ, అంజప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

## నేడు ధర్మకర్తల మండలి సమావేశం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయం ధర్మకర్తల మండలి సమావేశం శుక్రవారం ఏర్పాటు చేసారు. ధర్మకర్తల మండలి సమావేశం ఏర్పాటు చేయాలని జూలై 5న చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు రాతమూలకంగా ఇటకు ఇచ్చారు.కానీ పట్టించుకోలేదు. ఎందుకు ఏర్పాటు చేయలేదో అధికారులకే ఎరుక.ధర్మకర్తల మండలి సమావేశాల ఏర్పాటును కూడా అర్థించుకునే స్థితి చోటు చేసుకుంది.అయితే జూలై 5న అందించిన అజెండా మేరకు 15 అంశాలతో పొందుపరచారు.

## తల్లిని, చెల్లిని గెంటేసిన సిఎంకు రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదు

-ప్రజావేదిక కూల్చడంతోనే జగన్ పతనం

-మాజీ ఎంఎల్ఏ



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

గెంటేసిన రాష్ట్ర సైకో ముఖ్యమంత్రికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని, ప్రజా వేదిక క...గన్ పతనం ప్రారంభమైందని మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు అన్నారు. గురువారం ...యులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి అరెస్టు దుర్మార్గమైన చర్యగా అభివర్ణించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చోటుచేసుకున్న రాజకీయ పరిణా మాలు శుభసూచకమని వర్ణించారు. అభ్యుదయభావాలు, అభివృద్ధి కాంక్ష కలిగిన విజన్ నాయకుడు చంద్రబాబు నాయుడుతో కలసి పయనించుటకు జనసేనాని పవన్‌కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం సర్వత్రా ప్రశంసలు అందుకుంటోందని ఎస్సీవీనాయుడు అన్నారు. రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును సిఎం చేయడానికి ప్రతి కార్యకర్త తన సొంత ఎన్నికలుగా పనిచేయాలని చేస్తామని ఎస్సీవీనాయుడు అన్నారు. కనీసం ఎఫ్ఐఆర్ కూడా లేకుండా అరెస్టు చేసి నీతిబాహ్యాపాలన చేసిన ముఖ్యమంత్రి నేడు కలెక్షన్ల సిఎంగా మారాడని తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ప్రతి ఓటు ప్రజల కాళ్ళుపట్టుకుని వేడుకుంటామని రాష్ట్రానికి మళ్ళీ ముఖ్య మంత్రిగా చంద్రబాబునాయుడును గెలిపించుకుంటామన్నారు.

## హిందీభాషపై పట్టుసాధించుకోవాలి

**తొట్టంబేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



హిందీభాషపై పట్టుసాధించుకోవాలని కాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షాషావలి అన్నారు. గురువారం హిందీభాషాదినోత్సవం సందర్భంగా పాఠశాలలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు మరియు పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయురాలు శోభారాణి,మరియు ఇతర ఉపాధ్యాయులు హేమకుమార్, స్టాలిన్, జయప్రకాష్,వసుంధర పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయభాషపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

**తొట్టంబేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



జాతీయభాషగా ఉన్న హిందీ భాషపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సెయింట్‌జేవియర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షర్లి తెలిపారు. గురువారం హిందీ భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టుకు నిరసనగా రిలేనిరాహారదీక్ష

**తొట్టంబేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



చంద్రబాబునాయుడుపై వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధికారం చేపట్టి నాలుగున్నర సంవత్సరాల తర్వాతగత కాంగ్రెస్ పార్టీ దివంగత నేత డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి చంద్రబాబు నాయుడుపై ఎన్నో కేసులు పెట్టి నిరూపించుకోలేకపోయారన్నారు. చంద్రబాబు నాయుడుకు మద్దతుగా చిన్నకనపర్తి గ్రామంలో చెరుకూరి చిన్నినాయుడు ఆధ్వర్యంలో గ్రామకమిటీ అధ్యక్షుడు శంకర్‌నాయుడు, మహిళా అధ్యక్షురాలు రమాదేవి, కార్యదర్శి రమణమ్మ, రాజనేనిశేఖర్‌నాయుడు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మెరిమి వెంకట సుబ్బయ్య, బత్తెమ్మ, రామచంద్రనాయుడు, చెంగల్రాయులునాయుడు, మునిరత్నం నాయుడు, రత్నమ్మ, సరోజమ్మ, యువత అధ్యక్షుడు చక్రి, హేమంత్‌సాయి, భాస్కర్‌నాయుడు, ప్రతాప్, శ్రీనివాసులు, ప్రేమకుమార్, చిన్న పెంచలయ్య, నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఎఇఓకు విధులు కేటాయింపు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి శ్రీశైలం నుంచి వచ్చిన ఎఇఓ ఎకె ధనపాల్‌కు విధుల కేటాయింపులో భాగంగా ఆలయంలో అంతర్గత బదిలీలు నిర్వహించారు. ఈమేరకు ఆలయ ఇఓ కె.వి.సాగర్‌బాబు పలు మార్పులుచేర్పులు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారి చేసారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగా విధుల్లోచేరిన ధనపాల్‌కు జనరల్ విభాగం,ప్రధాన ఆలయ పర్యవేక్షణను అప్పగించారు.మరో సహాయ కార్యనిర్వహణాధికారి వై.సతీష్ మాలిక్‌కు ప్రోటోకాల్, వసతి విభాగం బాధ్యతలను అప్పగించారు. మరో ఎఇఓ పి.లోకేష్‌బాబుకు మాస్టర్ ప్లాన్, అనుబంధ ఆలయాలు, మింట్ అన్నదానం, శివసేవకుల నిర్వహణ, సమాచార కేంద్రం, మీడియా పాయింట్ వృద్ధాశ్రమం నిర్వహణ టిఎంయస్, పరోక్షసేవలు, యస్‌కెఐటి మరియు నర్సింగ్ కాలేజీ, డిసిబి, షాప్స్ పర్యవేక్షణను అప్పగించారు.ఈ ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలని ఆదేశించారు

## ట్రాక్టర్ ప్రమాదంలో యువతి మృతి!

**శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తి మండలం గంగలపూడి అరుంధతి వాడకు చెందిన యువతి లావణ్య(28) ట్రాక్టర్ ప్రమాధంలో మృతి చెందింది, సంఘటనకు సంబంధించి రూరల్ సిఐ అజయ్‌కుమార్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గంగలపూడికి సంబంధించి లావణ్య ట్రాక్టర్లో డ్రైవర్ సీటు వెనుక ఉన్న కమ్మీపై నిల్చుకొని ఉంది. ట్రాక్టర్లో అడవికి వెళ్ళి కర్రలు తెచ్చుకుంటుండగా గతుకుల్లో ట్రాలీలో ఉన్న కర్రలు ఆమెను గుద్దుకున్నాయి. సంఘటన జరిగిన వెంటనే గాయపడిన లావణ్యను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు ఢాక్టర్లు ధృవీకరించినట్లు వివరించారు.డ్రైవర్ బాలరాజుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వివరించారు.

## ఆకట్టుకున్న నృత్యోత్సవం

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయం నిర్వహిస్తున్న ధర్మప్రచార పరిషత్‌మాసోత్సవంలో భాగంగా ప్రతి రోజూ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న వేదికపై నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో గురువారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఆ చిన్నారులను ఆలయం తరఫున ఆశీర్వదిస్తూ స్వామి అమ్మవార్ల ప్రసాదాలను అందించారు.

## అంకాళమ్మ ఆలయం వద్ద అన్నదానం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త**



పట్టణంలోని పివిరోడ్డులో వెలసి ఉన్న శ్రీ అంకాళమ్మ దేవస్థానంలో గత రెండు సంవత్సరాల నుంచి ప్రతి నెల అమావాస్య రోజున మరాఠీపాళెం వాస్తవ్యులు అయిన గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈనెల సహాయ సహకరాలు అందించిన క్రాంతి కుమార్, డాక్టర్ కృపానిధి, ఉమేష్‌రావు, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, ప్రసాద్‌రెడ్డి, మాధ వసాయి, సాయి, గణేష్‌బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, బాబ్జీరావు, వినోద్‌రావు, అనూష, షర్మిళ, కల్పన, శ్రీరాం, అరుణ్, అమరనాథ్, శివకుమార్‌రెడ్డి, దిలీప్, మయూర్‌ప్రసన్న, కార్తీకేయన్, చేతలిశర్మ, జయంత్‌సింగ్, ఆనంద, దీపన్యయాదవ్, లీలామోహన్, జయగణేష్, హరిహర కుమార్, శివప్రసాద్, వినోద్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వైసిపిని గద్దె దించే వరకూ పోరాటం

**నగరి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :**



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు ప్రజల్లో నానాటికీ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వం ఆయనపై అక్రమ కేసు పెట్టి రిమాండ్‌కు పంపించిందని టిడిపి చిత్తూరు జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి అన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేంత వరకూ తమ పోరాటం ఆగదని, ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు, రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపు ప్రజలకు అవసరమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనులను పరిశీలించిన

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



పుత్తూరు మండలంలోని పరమేశ్వరమంగళం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ పరిశీలించారు. గురువారం నాడు-నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరచారు. ఆయనతో పాటు మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం గ్రామానికి చెందిన పి.గురుస్వామి నాయుడు అనే వ్యక్తికి ఓపెన్ హార్ట్ చికిత్స కోసం 6 లక్షలు ముఖ్యమంత్రిసహాయనిధి ద్వారా గురువారం బాధిత కుటుంబానికి మంత్రి రోజా అందజేశారు. మంత్రి రోజా క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి అందజేశారు. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆలయాల్లో ఘనంగా అమావాస్య పూజలు

**నారాయణవనం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



గురువారం మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు.

## కొనసాగుతున్న టిడిపి నేతల నిరవధిక నిరాహారదీక్ష

**నారాయణవనం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి మండల శ్రేణులు గత మూడు రోజులుగా నిరవధిక నిరాహారదీక్షను కొనసాగిస్తున్నారు. గురువారం మండలంలోని పాలమంగళం దక్షణపు కండ్రిగలో కొనసాగించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు ఎన్ భాస్కరన్, మండల టిడిపి క్లస్టర్ ఇంచార్జీ పి గిరిబాబులు మాట్లాడుతూ బాబుకు న్యాయం జరిగే వరకు తమ దీక్ష ఆగదన్నారు. ఈ దీక్షలు టిడిపి నేతలు మాజీ మండల టిడిపి అధ్యక్షులు టి షణ్ముగం, కెఎస్‌రవి, టి సుబ్రమణ్యం, బిట్ర బాలసుబ్రమణ్యం, నరేష్, కందస్వామినాయుడు, లత, శాంతి, పట్టాబిరెడ్డి, జయచంద్రనాయుడు, సి బాబు, మోహన్‌రాజు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ హిందీ భాషా దినోత్సవ వేడుకలు

**నారాయణవనం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**



మండలకేంద్రంలోని నారాయణ వనం బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌మాస్టర్ సులోచన మాట్లాడుతూ మన భారతదేశంలో హిందీ భాషను జాతీయ భాషాగా గుర్తిస్తూ గౌరవిస్తున్నట్టు గుర్తు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు డ్రాయింగ్ కాంపిటేషన్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందీ టీచర్లు కెటి వెంకటరమణ, పర్వీన్‌బేగం, పిడి జయప్రకాష్, టీచర్లు లక్ష్మీప్రసాద్, లోకనాధరాయల్, ప్రభాకర్‌నాయుడు, సురేష్‌బాబు, మునెయ్య, అందరు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా ఓపి, ఓటిలకు సెలవు

**తిరుపతి టౌన్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

స్విమ్స్‌లో వినాయక చవితి సందర్భంగా ఈ నెల 18వ తేదీ సోమవారం ఓపి, ఓటిలకు సెలవు దినంగా ప్రకటించిన్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రామ్ తెలిపారు. స్విమ్స్ అత్యవసర సేవలు యదాతథంగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

**సత్యవేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

సత్యవేడు మేజర్ పంచాయితీ దలవాయి అగ్రహారం పాఠశాలలో గురువారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె. మణిని సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎక్కడ పనిచేస్తే అక్కడ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన సమకూరడంతో పాటుగా మౌళిక వసతులు కూడా మెరుగుపడుతాయని వారు అభిప్రాయపడ్డారు.ఉపాధ్యాయులు నాగేంద్ర, దాము, వేలాయుధం, ద్రాక్షాయిని పాల్గొన్నారు.

## చిటికెడు మట్టితో ఐక్యతను చాటుదాం

**సత్యవేడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :**

చిటికెడు మట్టితో దేశ ఐక్యతను చాటాలని తిరుపతి జిల్లా బీజేపి ప్రధాన కార్యదర్శి తంజా మోహన్ పిలుపు నిచ్చారు. సత్యవేడు మండల అధ్యక్షుడు మునిప్రతాప్ ఆధ్వర్యంలో రాచపాళెం, చిన్న ఈటిపాకం, కొత్తమారికుప్పం, మదనంబేడు గ్రామాల్లో గురువారం మేరా మట్టి మేరా దేశ్-నాభూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శితో పాటు విచ్చేసిన ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మునికృష్ణయ్య, ప్రధానకార్యదర్శి వాసు మాట్లాడుతూ దేశ సమగ్రతను చాటేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలో అమృతవనం ఏర్పాటుకు సంకల్పించారు.ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు మోహన్‌బాబు, వెంకటేశ్వర్లురెడ్డి, కేశవులు, శేఖర్, దాము, గోవిందరాజులు పాల్గొన్నారు.

## పవన్ ప్రకటనతో జగన్ ప్రభుత్వం పతనం ఖాయం

-టిడిపి సీనియర్ నేత ఊకా విజయ్‌కుమార్



తిరుపతి(విద్య) సెప్టెంబర్ 14 ప్రభాతవార్త: రానున్న ఎన్నికల్లో జనసేన-టిడిపి కలిసే వెళతాయని గురువారం రాజమహేంద్రవరంలో పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు.దీంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పతనం కావడం తథ్యమని టిడిపి సీనియర్ నేత ఊకా విజయ్‌కుమార్ స్పష్టం చేశారు.గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద చంద్రబాబుకు భరోసా దీక్షా కార్యక్రమంలో పాల్గొన్న విజయ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ప్రకటనతో ఒక్కసారిగా వైకాపా శ్రేణుల్లో అలజడి మొదలయిందని,రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి-జనసేనలు అఖండ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

## నేటి నుంచి ఇంటింటా సర్వే

**కోట,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :**

జిల్లాలోని ప్రజల ఆరోగ్య భద్రతకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా నేటి నుంచి వాలంటీర్లు,ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఇంటింటా సర్వే చేయనున్నట్లు ఎంపిడివో మారెళ్ల భవాని తెలిపారు.45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు విజయవతం అమలు చేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులను వర్చువల్ విధానంలో ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

## అక్రమ అరెస్ట్ నుండి చంద్రబాబును వెంటనే విడుదల చేయాలి

-రెండోరోజు రిలే నిరాహార దీక్షలో పులివర్తి నాని

**చంద్రగిరి, సెప్టెంబర్14 ప్రభాతవార్త:**



ఏలాంటి ఆధారాలు లేకుండా అక్రమ అరెస్ట్ చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని వెంటనే విడుదల చేయాలని చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని డిమాండ్ చేసారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా చంద్రగిరి క్లాక్ టవర్ వద్ద టిడిపి శ్రేణులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో గురువారం పులివర్తి నాని పాల్గొన్నారు. దేశం మెచ్చిన నాయకుడు గురించి దేశ వ్యాప్తంగా మద్దతు పలుకుతున్నారని, 14 సంవత్సరాలు పాటు సుపరిపాలన అందించిన బాబునే అరెస్ట్ చేయడం దారుణమని పేర్కొన్నారు. సి.యం. జగన్ సైకో విధానం వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. వైకాపా నాయకులు చేస్తున్న అవినీతిని ఇతరులనూ రుద్దడం అనాయితీగా వస్తుందని, టిడిపి అధికారంలోకి వస్తే వైకాపా నాయకులు అవినీతిని బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని ఆశాభావం వ్యక్తం చేసారు. రెండోరోజు నిరాహార దీక్షలో చిన్నగొట్టిగల్లు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడప గడపకు ఆత్మీయ పలకరింపులో చెవిరెడ్డి లక్ష్మీ

**తిరుపతిరూరల్, సెప్టెంబర్14 ప్రభాతవార్త:**



జగనన్న ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ... స్థానిక ప్రజలు తెలిపే ప్రజా సమస్యలను సావధానంగా వింటూ.. సమస్యలనే అక్కడికక్కడే పరిష్కరిస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మీ లింగేశ్వర్‌నగర్‌లో ముందుకు సాగారు. గురువారం లింగేశ్వర్‌నగర్‌లో జరిగిన గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో చెవిరెడ్డి లక్ష్మీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లింగేశ్వర్‌నగర్ గ్రామ సర్పంచ్ ముసుకు కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి విజయ నిర్మల, యువనేత సాయిరాయిల్, వైకాపా నాయకులు రవి, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ట్రెండ్స్‌లో ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు

**తిరుపతి(విద్య) సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:**




స్థానిక మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మంగళం ట్రెండ్స్) నందు గురువారం హిందీ దినోత్సవ వేడుకలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వము, అంత్యాక్షరి, బాల గేయాలు, కవితలు, చిత్రలేఖనం, నాటకాలు, నృత్యం తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. బ్యాంక్ అధికారి అభిమన్యుకుమార్ మాట్లాడుతూ జాతీయ భాష అయిన హిందీ భాష యొక్క ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. హిందీ ఆఫీసర్ మనోజ్‌కుమార్ దాస్ మాట్లాడుతూ హిందీ నేర్చుకోవడం వల్ల కలిగే ఉపాధి అవకాశాలను తెలియచేశారు.విద్యార్థులు హిందీ చదవడం,రాయడంతో పాటు,మాట్లాడటంలో ఎక్కువ సాధన చేయాలని బ్యాంక్ మేనేజర్ రమణ సూచించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.కేశవులునాయుడు మాట్లాడుతూ పాఠశాలలోని హిందీ టీచర్లు వినూత్న కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులలో హిందీ అభివృద్ధికి చక్కగా కృషి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఘనంగా అంకురార్పణ

**రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



రేణిగుంట గుంటకట్ట వద్ద కొలువు తీరిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి, శ్రీ జ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీ నందీశ్వరాలయం లో జీర్ణోధారణ అష్టబంధన సమర్పణ కుంభాభిషేక మహోత్సవ అంకురార్పణ గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పార్థిబన్ శ్రీ బాలాజీ సేవా కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో కార్యక్రమం వైభవంగా జరిగింది. మహా కుంభాభిషేక మహోత్సవాలు గురువారం నుంచి ఆదివారం వరకు జరుగుతాయని ధర్మకర్త తెలిపారు. కలశాల పూజ శాశ్వతంగా చేశారు. పెద్ద సంఖ్యలో ముత్తయిదులు, ఆడ పడుచులు, భక్తులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతి తప్పని సరి : అర్బన్ సీఐ

**రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాలకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డి అన్నారు. అనుమతి లేకుండా వినాయక మండపాలు నిర్మించి శ్రీ వినాయక ప్రతిమలను ప్రతిష్టిస్తే చర్యలు కఠినంగా మండపాల నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. విపరీతమైన శబ్దాలతో మైక్ సెట్‌లు, డీజేలు పెట్టకూడదన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి, రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకోకతప్పదన్నారు. అర్బన్ ఎస్ఐ ఈశ్వరయ్య పర్యవేక్షణలో పోలీసులు గస్తీ తిరుగుతారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం అవసరమైతే ప్రత్యేక బలగాలను పిలిపిస్తామన్నారు.

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ రిలే నిరాహారదీక్ష

**రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ తెలుగు తమ్ముళ్ల గురువారం రేణిగుంట పాత చెక్‌పోస్టు సమీపంలో బాబుకి తోడుగా ఓ నియంతపై పోరాటం కోసం మేము సైతం అంటూ బ్యానర్ తగిలించి రిలే నిరాహారదీక్ష చేశారు. చంద్రబాబునాయుడుకి అన్యాయం జరిగిందంటూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని నియంతగా అభివర్ణించారు. నిరాహారదీక్షలో మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, జిల్లా టీడీపీ నాయకుడు నరసింహ యాదవ్, శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.నాయుడు, టీడీపీ మహిళా నేతలు రిషితారెడ్డి, చక్రాల ఉష, మాజీ ఎంపీపీ స్వాతి, రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, జిల్లా టీడీపీ నాయకులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామినాయుడు, ఏర్పేడు టీడీపీ నేత పున్నారావు, పార్టీ సీనియర్ నేతలు చిన్నారెడ్డి, పుష్పనాథం, అడ్వకేట్ ఉదయకుమార్‌రెడ్డి, బుజ్జి నాయుడు, భాస్కర్‌రెడ్డి, మురళి, కొరియర్ రవి, నెల్లూరు సుబ్రహ్మణ్యం, కన్నన్‌రెడ్డి, ముచ్చెలి భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మనిషి మధుసూదన్‌రెడ్డి

**రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రజల పక్షపాతని రేణిగుంట మండల వైసీపీ ఇన్‌చార్జి పవిత్రరెడ్డి అన్నారు. గురువారం పవిత్రరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సహకారంతో రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయతీలో నూతనంగా నిర్మించిన బేతేలు ప్రార్థన మందిరాన్ని ప్రారంభించారు. చర్చి నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అడిగిన వెంటనే రెవెన్యూ అధికారుల ద్వారా చర్చి కోసం స్థలం మంజూరు చేయించిన ఎమ్మెల్యే, పవిత్రరెడ్డికి చర్చి పాస్టర్ నాగరాజు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆమె తారక రామానగర్‌లో కొత్తగా మంజూరైన 65 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలతో పాటు వైస్ ఎంపీపీ సుజాత, రేణిగుంట సర్పంచ్ నాగేషం, రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, వైసీపీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, శశికిరణ్, గంగయ్య, ఇన్బానాధన్, సుందర మూర్తి, చర్చి పాస్టర్లు నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినా గెలిచేది జగనన్న : ఎమ్మెల్యే

**రేణిగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



ఎన్ని కుట్రలు పన్నినా, ఆరోపణలు చేసినా ప్రజాబలం ఉన్న నేత జగన్మోహన్‌రెడ్డి ఓడించడం ఎవరి తరం కాదని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మరల నొక్కి వక్కాణించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గురువారం ఆయన రేణిగుంట పంచాయతీలోని వేణుగోపాలపురం, శివకుమార్‌నగర్‌లలో గడప గడపకు తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. గడప గడపకు తిరిగిన వారిలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయ్ సంతోష్, అర్బన్ సీఐ సుబ్బారెడ్డి, ఈవోపీఆర్‌డీ రత్నమ్మ, ఎంఈవో ఇందిరాదేవి, జడ్పీటీసీ సంధ్యారాణి, ఎస్ఐ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ సుజాత, రేణిగుంట సర్పంచ్ నాగేషం, రేణిగుంట పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, గాజులమండ్యం సర్పంచ్ డా. గంగారి రమేష్, వార్డు మెంబర్ల ఇన్‌చార్జి యువనేత సందీప్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నేతలు జువ్వల దయాకర్‌రెడ్డి, యోగీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు జువ్వల ధనంజయరెడ్డి,శశికిరణ్, గురవరాజుపల్లి నేత రహీం, మైనారిటీ నేతలు అబ్దుల్ ఖాదిర్, సుభహాన్ రాజా, షబ్బీర్ అహ్మద్, ఇరానీ ఖాదర్, సైకిల్ షాపు అలీ, ఇన్బానాధన్, రమణ, మాజీ ఎంపీటీసీ నాగరాజు, పలువురు ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌ను నయం చేయవచ్చు

**వడమాలపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



క్యాన్సర్‌ని మొదటి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చక్రపాణి పేర్కొన్నారు. టాటా కంపెనీ సహకారంతో స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ బొమ్మరాజపురం గ్రామంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, మంజుల, చంద్రమోహన్, ప్రియ, కల్పన, స్విమ్స్ నుంచి హేమంత్ కుమార్, మోహతాజ్, అమరావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి రెజ్లింగ్‌లో స్వీటీకి పతకం

**వడమాలపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట జూనియర్‌కళాశాల విద్యార్థిని స్వీటీ కుమారి కాంస్య పతకం సాధించింది. ఈ నెల శని, ఆదివారాల్లో ఢిల్లీలో జాతీయ స్థాయి బాలికల రెజ్లింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న స్వీటీ కుమారి త్రితీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. పతకం సాధించిన స్వీటీ కుమారిని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమ్మ, పీడీ జయరామయ్య, అధ్యాపకులు అభినందించారు.

## రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు వడమాలపేట విద్యార్థులు

**వడమాలపేట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:**



రాష్ట్ర స్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ రెజ్లింగ్‌పోటీలు చిత్తూరు జిల్లా యాదమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన వడమాలపేట విద్యార్థులు ఫ్రీ స్టైల్ విభాగంలోరాష్ట్ర స్థాయి పోటీలకుఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 21 నుంచి 23వ తేదీ వరకు ఎన్‌టీఆర్ జిల్లా నున్న గ్రామంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారు.

## సాగు ఖర్చులు తగ్గితేనే ఆదాయం పెరుగుతుంది

తొట్టంబేడు, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



అన్నదాతలు పండించే పంటల సాగులో రైతులు అనవసర ఖర్చులు తగ్గిస్తేనే ఆదాయం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని పూడి గ్రామంలో ఆత్మ సహకారంతో ఆయన రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఇచ్చారు. కార్యక్రమానికి శ్రీకాళహస్తి వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్‌రెడ్డి, మండల ఎఓ సురేంద్రరెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏడిఏ భాస్కరయ్య మాట్లాడుతూ రైతులు వరిలో అధికంగా ఎరువులు ఉపయోగించినా పైరు అవసరమైన వరకే తీసుకుని మిగతా వృదాగా పోతోందని తెలిపారు. దీని వలన రైతులకు ఖర్చు తప్ప ఆదాయం పెరగదన్నారు. రసాయన ఎరువులు, గుళికల మందులు, కలుపు మందులు అధికంగా వాడకం వల్ల భూమి జీవం కోల్పోతుందని తెలిపారు. శ్రీకాళహస్తి ఏడిఏ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రబీ రైతులకు అవసరమైన ఎరువులు ఆర్బీకేల ద్వారా అందించడం జరుగుతోందన్నారు. ఇఫ్కో జిల్లా క్షేత్ర అధికారి మణి వరిపైరులో నానో ఎరువులు మరియు మరియు జీవన ఎరువుల వినియోగం గురించి తెలిపారు. మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రైతులందరు ఈ క్రాప్ బుక్ చేసుకోవాలని అప్పుడే ప్రభుత్వ పథకాలు తప్పక వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకురాలు కవిత, పలువురు అన్నదాతలు పాల్గొన్నారు.

## బలిజ కమ్యూనిటి భవనం కోసం ఐక్యమత్యంగా కృషి చేద్దాం!

-శ్రీకృష్ణ దేవరాయలు,వంగవీటి రంగా విగ్రహాలు ఏర్పాటు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలో అత్యధిక ఓట్లు కల్గిన బలిజ సామాజిక వర్గం కమ్యూనిటి భవనం నిర్మాణం కోసం ఐకమత్యంగా పనిచేయాలని గురువారం జరిగిన శ్రీకృష్ణదేవరాయబలిజ సంక్షేమ సంఘం సమావేశంలో పలు కీలక అంశాలకు సంబంధించి చర్చించారు.ఈ సమావేశాన్ని సంక్షేమ సంఘం నిర్వహించగా పార్టీలకు అతీతంగా బలిజ సంఘానికి చెందిన యువకులు హాజరయ్యారు.ఈ సమావేశంలో కమ్యూనిటి భవనం నిర్మాణం కోసం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడక తమ సామాజిక వర్గంలోని అందరి సహకారంతో నిర్మించుకుందామని చర్చించుకున్నారు. సమావేశంలో భవన నిర్మాణానికి సంబంధించి 15రోజుల లోపల భూమి పూజలు చేయాలని అభిప్రాయపడ్డారు. అలాగే శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని రాయల గోపురం ఎదురుగా ఏర్పాటు చేయటానికి, అంతేకాక బలిజ సంక్షేమానికి తమ ప్రాణాలను అర్పించిన వంగవీటి రంగా వర్ధంతి రోజు ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించుటకు సమావేశంలో తీర్మానించారు.ఎంతో కాలంగా భవన నిర్మాణానికి స్థలం కేటాయించినా భవన నిర్మాణానికి నోచుకోలేదని ఇప్పటికైనా భవన నిర్మాణంపై యువకులు ముందుకు రావాలని తీర్మానించారు. మన సామాజిక సంక్షేమానికి కొంత సమయం కేటాయించాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,మాజీ అధ్యక్షుడు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, టౌన్‌బ్యాంకు చైర్మెన్ శెట్టిపల్లి సురేష్, మాజీ మున్సిపల్ చైర్మెన్ ముత్యాల పార్థసారధి, పోలసామి స్వర్ణమూర్తి, షణ్ముగం, పగడాల రాజు, గరిక పాటి చంద్ర,చింతామణి పాండు,సిద్దులుగారి జయబాబు, సిద్దులు గారి మురళి, చిట్టివేలు జయగోపాల్, కృష్ణయ్య,గాజుల సత్యనారాయణ, కొండుగారి కృష్ణకుమార్,కండ్రిగ ఉమ,పాగాలి రామకృష్ణ, పూల కృష్ణమూర్తి,కొట్టే సాయి,కంఠా ఉదయ్,మందలబాలాజి, అంజూరు వెంకటేష్ బాబు, కొట్టేన రేష్, నాగమల్లి రాజశేఖర్,శ్రీపురం సుధాకర్, చక్రాల మురళి,జొన్నల గద్దమురళి,మాధవ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం : ఎంఈవో బాలయ్య

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని మండల విద్యాశాఖాధికారులు భువనేశ్వరి, బాలయ్యలు అన్నారు.పట్టణంలోని ఆర్‌పిబిఎస్ జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ సెలక్షన్స్ జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఎస్ఎంసి చైర్మన్ ఆర్కాటుశంకర్, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, మండల క్రీడల కోఆర్డినేటర్ వెంకటమునిలు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండల పరిధిలో స్కూల్‌గేమ్స్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అథ్లెటిక్స్ జెమ్స్ మరియు త్రోబాల్, కోకో, టెన్నికాయిట్, త్రోస్, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ ఆర్‌రన్స్, బ్యాడ్మింటన్, కబడ్డీ, యోగా క్రీడలకు సంబందించి అండర్ 14 మరియు 17 విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఎంపికలకు రూరల్ అర్బన్ పరిధిలోని 17ఏళ్ళలోపు బాల బాలికలు పాల్గొనవచ్చున్నారు. ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ ఆర్కాడు శంకర్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసికోల్లాసం, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని అలాగే క్రీడల వల్ల విద్యపై ఏకాగ్రత పెంపొందించవచ్చని ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొన్నారు.

## వైద్య చికిత్సకు రూ.6.00 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్

పుత్తూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :

మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక కుటుంబానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సాయం చేశారు. రూరల్ మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామానికి చెందిన పి.గురుస్వామినాయుడుకు ఓపెన్ హార్ట్ శస్త్ర చికిత్స కోసం రూ. 6.00 లక్షలను గురువారం నగరిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె అందించారు. దీనికి బాధిత కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈ నెల 15వ తేది నుండి ప్రారంభమై 45 రోజుల పాటు నిర్వహిస్తున్నారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని దాదాపు 90 శాతం గృహాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రజల ఆరోగ్య దృష్ట్యా మన రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రజాహిత కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ నెల 30వ తేది నుంచి అక్టోబర్ 27వ తేది వరకు ఆయా వార్డు పరిధిలో నిర్వహింపబడు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నందు స్పెషలిస్ట్‌లచే వైద్యం చేయించబడుతున్నారు. తిరుపతి నగర పాలక సంస్థ నందు 2 టీములను ఏర్పాటు చేయడం జరిగిందని ఆ టీముల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను పర్యవేక్షించబడునని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ తెలిపారు.

## ఈ నెల 17న సీనియర్ పురుషులకు సెలక్షన్స్

తిరుపతి (క్రీడ), సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :

జిల్లా ఫుట్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేది ఆదివారం ఉదయం 9 గంటలకు తుమ్మలగుంట, తుడా మైదానంలో సీనియర్ పురుషులకు సెలక్షన్స్ నిర్వస్తున్నట్లు సెక్రటరీ రెడ్డెప్ప పేర్కొన్నారు. ఈ టీమ్ ఈ నెల 20వ తేది నెల్లూరులో జరిగే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. జోనల్ పోటీలో గెలుపొందిన వారు 22,23,24 తేదీలలో నెల్లూరులో జరిగే అంతర్ జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పోటీలలో పాల్గొనవారు ఆదార్ కార్డు, రెండు ఫోటోలు తీసుకోని రావాలన్నారు. వివరాలకు 9963998853 నెంబరుని సంద్రించాలన్నారు.

## ఎస్వీయూ ఈసి మెంబర్‌కు 'రిమ్స్' అభినందనలు



తిరుపతి(విద్య) సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:

కొత్తగా ఏర్పాటైన శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పాలకమండలికి ఈసి మెంబరుగా ఎంపికైన 'సీకాం' డిగ్రీ కళశాల కరస్పాండెంట్ డా॥టి.సురేంద్రనాథరెడ్డిని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్) ఎంసిఏ, ఎంబిఏ, ఎంఎస్‌సి (కంప్యూటర్స్) కళాశాల ప్రిన్సిపాల్ డా॥జె.ప్రకాష్‌రెడ్డి అభినందిం చారు. గురువారం ఈ మేరకు ఆయనను తన కార్యాలయం నందు ప్రకాష్‌రెడ్డి కళాశాల సిబ్బందితో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం,దుశ్శాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియచేశారు.ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఒక విద్యావేత్తగా,ప్రైవేట్ విద్యా సంస్థలను పరిపాలించిన అనుభవం కలిగిన సురేంద్రనాథరెడ్డి ఈసి బెంబర్‌గా రాణిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉన్న లోటుపాట్లను యూనివర్సిటీ అధికారుల సహాయంతో సరిచేస్తారని,అలాగే ప్రైవేట్ విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్లు డా॥వై.కొండారెడ్డి, వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి,ఎంబిఏ హెచ్ఒడి డా॥పి.నిరంజన్‌రెడ్డి,ఎంసిఏ హెచ్ఓడి పి.మధుర,సిబ్బంది పాల్గొని అభినందనలు తెలియచేశారు.

## గ్రామ స్వరాజ్యం సాకారం చేసిన సీఎం జగన్ : ఎమ్మెల్యే

నాయుడుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన 116 పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి సూర్యోదయానికి ముందే తలుపుతట్టి పింఛన్ నగదును అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరావు, మండల వైసీపీ అధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపిపి ధనలక్ష్మి, ఎన్‌డిసిసిబి మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, నాయకులు కటకం జయరామయ్య, పాదర్తి హరినాథరెడ్డి, చదలవాడ కుమార్, గంధవల్లి సిద్ధయ్య, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి రాహుల్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ జగన్ కట్టుకథ

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అల్లిన కట్టుకథ అని మాజీమంత్రి పరసా రత్నం అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రం మొత్తంమీద జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, త్వరలోనే జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆరునెలల్లో తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవుతారని ఆయన చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న వైసీపీ నేతలు తర్వాత జరిగే పరిణామాలను చవిచూడాల్సి వస్తుందని పరసా రత్నం హెచ్చరించారు. తిరుపతి పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడిని అరెస్టు చేసి చంకలు గుద్దుకుంటున్న వైసీపీ నేతలు త్వరలోనే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సూళ్లూరుపేటలో జరిగిన టిడ్కో ఇళ్ల కుంభకోణాన్ని త్వరలోనే బయటపెడ తామని ఆయన పేర్కొన్నారు. అలాగే చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు నుంచి త్వరగా విడుదలై బయటకు రావాలని ఆకాంక్షిస్తూ సుదర్శన మహాహోమాన్ని పార్టీ కార్యాలయం వద్ద శ్రీకాళహస్తి వేదపండితులతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమాళ్లు, అలవల శ్రీనివాసులు, రాజేశ్వరి, మంజుల, దంతాల రవి, సురేష్‌నాయుడు, మాధవనాయుడు, ఎజి కిషోర్, మెస్ రమణయ్య, గాడి నారాయణరెడ్డి, బొమ్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 88.76 లక్షలు ఆదాయం

కాణిపాకం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 88.76 లక్షలు రూపాయలు ఆదాయంగా వచ్చింది. గురువారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ ఎ.వెంకటేశు ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 13 రోజులకు గాను హుండీల ద్వారా 88,76,220 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 5 గ్రాముల బంగారు, 450 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 7,238 రూపాయలు ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 1,131 అమెరికా డాలర్లు, 50 సింగపూర్ డాలర్లు, 65 యూఏఈ దినార్స్, 40 కెనడా డాలర్లు, 55 యూరో కరెన్సీ, 5 ఇంగ్లాండ్ ఫౌండ్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ చిత్తూరు ఏసీ ఏకాంబరం, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు రవి, రంగస్వామి, కోదండపాణి, శ్రీధర్‌బాబు యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## బిటెక్ ఫలితాల్లో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థుల ప్రతిభ

కుప్పం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



అనంతపురం జెఎన్‌టియు విడుదల చేసిన బిటెక్ ఫస్టియర్, ద్వితీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు బిసిఎస్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. సిఎస్ఇలో తనూజశ్రీ 93.88శాతం మార్కులతో ప్రథమస్థానం, సాయి గ్రీష్మిత 91.44శాతంతో ద్వితీయ స్థానం, జయశ్రీ 90.11శాతం మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అత్యధిక శాతం విద్యార్థులు డిస్టింక్షన్, ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ బిసి నాగరాజ్, వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ అభినందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, హెచ్ఒడి మాధవన్ పాల్గొన్నారు.

## మహిళలకు సాధికారత కల్పించడమనేది ఎస్వీసిఈ నైతికత

-కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎన్.సుధాకర్‌రెడ్డి

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 14 ప్రభాతవార్త:



మహిళలకు సాధికారత కల్పించడమనేది ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ యొక్క నైతికతలో ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎన్.సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నందు పాలిసిస్టిక్ ఓవరిన్ డిసీజ్(పిసిఓడి) అనే అంశంపై విద్యార్థినులకు, మహిళా ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు కాలిఫోర్నియాలోని ఎన్‌హెచ్ఐ సంస్థలో శిక్షణ పొందిన డిల్లీరాణి వినోద్ (ధృవీకరించబడిన లైఫ్ అండ్ వెల్‌నెస్ కోచ్ కమ్ న్యూట్రిషనిస్ట్) ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆమె మహిళలు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పిసిఓడికు ముందు జాగ్రత్త చర్యలు,ఆచరించవలసిన నియమాలు గురించి అవగాహన కల్పించి,సుదీర్ఘంగా చర్చించి తగు సూచనలు ఇచ్చారు.ఈ సదస్సుకు కళాశాల ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డా॥రేణుకాదేవి సమన్వయకర్తగా వ్యవహరించారు.కార్యక్రమంలో వివిధ మహిళా విభాగాధిపతులు,అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

## లోకా ఫౌండేషన్‌చే పాఠశాలలకు బోధనా సిబ్బంది

వరదయ్యపాలెం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :

వరదయ్యపాలెం మండలం బుచ్చినాయుడుకండ్రిగ మండలం వ్యవస్థను ప్రారంభించిన, రెండు మండలాల విద్యాశాఖ అధికారులు సరస్వతి, సుబ్రమణ్యంలు సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే





లోకా ఫౌండేషన్ అవసరమున్న పాఠశాలలకు బోధనా సిబ్బందిని ఏర్పాటు చేసారు. అలాగే చిన్న పిల్లలలో రోగ నిరోధకశక్తి పెరగాలని ప్రతి నెల పుష్యమీ నక్షత్రం రోజున స్వర్ణ బిందు ప్రాశన కార్యక్రమం, ప్రతి నెల రెండవ, నాలుగవ గురువారం కలిక్కం సిద్దనేత్ర ఔషదం ఇవ్వడం జరుగుతుందని లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు బోధనా సిబ్బంది కొరత ఉందని వరదయ్య పాలెం మండల విద్యా శాఖాధికారి ముని సుబ్రమణ్యం లోకా ఫౌండేషన్ వారి దృష్టికి తీసుకెళ్లి సిబ్బంది కొరతను గతంలో మాదిరి పరిష్కరించవల్సిందిగా కోరారు. అందుకు లోకా ఫౌండేషన్ వారు సానుకూలంగా స్పందించి బోధనా సిబ్బంది కొరతను గతంలో లాగా పరిష్కరించవల్సిందిగా కోరారు. అందుకు లోకా ఫౌండేషన్ వారు సానుకూలంగా స్పందించి బోధనా సిబ్బంది కొరత ఉన్న పాఠశాలలకు విద్యా శాఖాధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం 40 మంది విద్యా వాలంటీర్‌లను బుచ్చి నాయుడు కండ్రిగ మండలంలో 15 మరియు వరదయ్యపాలెం మండలంలో 25 మందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యా శాఖాధికారి సరస్వతి, బుచ్చినాయుడు కండ్రిగ విద్యా శాఖాధికారి మునిసుబ్రమణ్యం కోరిన వెంటనే విద్యాభివృద్ధికి కావాల్సిన సహాయం చేసి విద్యా వాలంటీర్‌లను ఏర్పాటు చేసినందుకు లోకా ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకా పౌండేషన్ జనరల్ మేనేజర్ సునిల్ జి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు హరి గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాబాయ్ పాల్గొన్నారు.

## కర్లీ గీతాంజలికి డాక్టరేట్ ప్రధానం

తిరుపతి (మహిళావర్సిటీ), సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి జీవ సాంకేతిక విభాగం పరిశోధక విద్యార్థిని కర్లీ గీతాంజలికి డాక్టరేట్ ప్రధానం చేసిన్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎక్సమినేషన్స్ కార్యాలయం తెలిపారు. ఈమె అదే విభాగానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకులు ఆచార్య వి. కళారాణి మార్గదర్శకత్వంలో డెవలప్మెంట్ ఆఫ్ పాయింట్ ఆఫ్ కేర్ డియాగ్నోస్టిక్ టూల్స్ ఫర్ డిటెక్షన్ ఆఫ్ బోవిన్ ట్రైకోమోనోసిన్ ఇన్ క్యాటిల్ అనే అంశం పై పరిశోధనా గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించినట్లు పేర్కొన్నారు.

## వైసిపిపై పోరాటంలో మీ వెంటే వుంటాం : గాలి భానుప్రకాశ్

పుత్తూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :



రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వంపై పోరాటంలో మీ వెంటే వుంటామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ తెలిపారు. గురువారం రాజమండ్రిలో లోకేష్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్ట్‌తో ప్రజల్లో వైసిపి పట్ల తీవ్ర వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రజల హక్కు అని, ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ హింసిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఎపుడు సాగనంపుదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. వైసిపి దుర్మార్గపు చర్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని లోకేష్ సూచించినట్టు భానుప్రకాశ్ తెలిపారు.

## ఎస్టీ కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కారం

విజయపురం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :



మండలంలోని విజయపురం ఎస్టీ కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారం కానున్నది. గురువారం కాలనీలో మంచినీటి సరఫరా కోసం బోరు వేయడంతో ఆశించిన స్థాయిలో నీరు వచ్చిందని సర్పంచ్ మేరీ ప్రసన్నకుమార్ తెలిపారు. గడప గడపకు మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో గ్రామస్తులు మంచినీటి సమస్యను మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఆదేశాల మేరకు బోరు వేస్తున్నామని తెలిపారు.

## టిడిపి - జనసేన పొత్తుపై హర్షం

పుత్తూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :



అక్రమ కేసులో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును రిమాండ్‌కు పంపిన నేపథ్యంలో ఇకపై టిడిపి, జనసేన కలిసి నడవాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని ఐటిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాలి గోపినాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకోవడంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవడం గొప్ప విషయమని అభివర్ణించారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చ లేని నాయకుడిని కావాలని అవినీతి కేసులో ఇరికించడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో పవన్‌కల్యాణ్ మద్దతు టిడిపి కార్యకర్తలకు మనో ధైర్యాన్నిచ్చిందని తెలిపారు.

## ఘనంగా హిందీ బాషా దినోత్సవం

విజయపురం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :



మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో గురువారం హిందీ బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హిందీ బాష ప్రాముఖ్యతను, దేశంలో జాతీయ బాషగా హిందీని అనుసరిస్తున్న రాష్ట్రాల గురించి తెలిపారు. అనంతరం విద్యార్థులకు హిందీ బాష ప్రాముఖ్యతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మండలంలోని శ్రీహరిపురంలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలను ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్ నిర్వహించి బహుమతులు అందించారు.

## హిందీ బాషలో నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు

-ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :



భారతదేశ జాతీయ బాష అయిన హిందీలో నైపుణ్యం సాధిస్తే దేశంలో ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు అందు బాటులో వుంటాయని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హిందీ విభాగాధిపతి డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ ఆధ్వర్యంలో జాతీయ హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ బాషలు, విభిన్న సంస్కృతులు నిలయమైన భారతదేశాన్ని హిందీ బాష ఐక్యంగా వుంచుతోందని తెలిపారు. హిందీ విభాగాధిపతి డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకం చేసిన హిందీ బాషను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలన్నారు. అనంతరం హిందీ బాషలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాసం, పాటల పోటీల్లో విజేతలకు ప్రిన్సిపల్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.వీరయ్య, డాక్టర్ దేవకి, డాక్టర్ వెంకటేశన్, డాక్టర్ మన ్యం నరసింహులు, డాక్టర్ గాయత్రి, డాక్టర్ తిరుమలయ్య, శ్రీదేవి, శ్రీనివాసులు, గంగయ్య, నరసింహారెడ్డి, రఘురామన్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకచవితిని...ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం

తిరుపతి,సెప్టెంబర్14ప్రభాతవార్త:



విఘ్నాలకు అధిపతి వినాయకుడి పండుగను అందరూ ప్రశాంతవాతావరణంలో జరుపుకుందామని ,ఇందుకు వరసిద్ది వినాయక మహోత్సవ కమిటీ అన్ని విధాలా సహకరిస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. తిరుపతిలోని కమిటీ కార్యాలయంలో గురువారం కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కమిటీసభ్యులు భానుప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి ,గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఎస్‌వీఎం వెంకటేష్, కొండె చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్‌నాయుడు, దామవంశీ, కీర్తి వెంకయ్య, మునిరత్నం, కరాటే శ్రీనివాస్, నవీన్, గోపి, ప్రసాద్, మణికంఠ,వాసులతో కలసి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. తిరుపతి వరసిద్ది వినాయక మహోత్సవ కమిటీ ఏర్పడి 22 సంవత్సరాలు విజయవంతంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులతో పూర్తి చేసుకోవడం శుభపరిణామం అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే మట్టివినాయకుడినే పూజిద్దామని కోరారు.

## దొంగ ఓట్లపై జిల్లా స్థాయి సమావేశంలో...పులివర్తి నాని సతీమణి

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 14,ప్రభాతవార్త :

కలెక్టర్ కార్యాలయంలో దొంగ ఓట్ల పై జిల్లా స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల కొద్ది దొంగ ఓట్లు నమోదులో చంద్రగిరి నియోజకవర్గం మొదటి స్థానంలో వుందన్నారు. బిఎల్ఓ సూచనలు ఇచ్చారు. వెరిఫికేషన్ పాదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వాలు మారుతూ ఉంటాయని, బిఎల్ఓ ఉద్యోగాలు శాశ్వతమన్నారు. ప్రలోభాలకు లొంగి భయపడి విధి నిర్వహణ పట్ల అశ్రద్ధ వహించకండని భావితరాలకు భవిష్యత్తు మీరని సూచించారు. ప్రతి ఓటర్ అప్లికేషన్ క్షుణ్ణంగా పరిశీలించి దొంగ ఓట్లను నిర్మూలించాలని ఆమె కోరారు.

## శ్రీ వారి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక చర్యలు

- తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి టి. చెంగల్ రెడ్డి

తిరుపతి రవాణా, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :



శ్రీ వారి సాలకట్ల బ్రహ్మోవ త్సవానికి భక్తులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి టి. చెంగల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో జోన్ 4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిఎస్ఆర్‌టిసి ప్రస్తుతం 410 బస్సులతో ప్రతి రోజు 3354 ట్రిప్పులతో తిరుపతి - తిరుమల మధ్య తిరుగుచూ సుమారు ఒక లక్ష మందికి ప్రయాణ సౌకర్యం కలిగిస్తామన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల ప్రజా రవాణాధికారులు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఇతర అధికారులు, తిరుపతి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, జిల్లాలోని డిపో మేనేజర్లు, సెక్యూరిటీ వి అండ్ ఎస్ఓ, సిఎస్ఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో రాడార్ ఇంజనీరింగ్‌పై శిక్షణ సదస్సు

కోట, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఇసిఇ విద్యార్థులకు ఎలక్ట్రో మేగ్నటిక్, రాడార్ ఇంజనీరింగ్‌పై రెండురోజుల పాటు ప్రయోగాత్మక శిక్షణా సదస్సుకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి అసోసియేట్ ప్రొఫెసర్ (కర్నాటక) శ్రీహరిలు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా జోనయతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా అతిథి శ్రీహరి మాట్లాడుతూ విద్యుదయస్కాంత తరంగాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఏ విధంగా స్పందిస్తాయో వాటి పనితీరు వల్ల కలిగే ప్రయోజనాలు, మార్పులను ఎలా గుర్తించాలో వాటిపై ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ జి.హరినాథరెడ్డి మాట్లాడుతూ ఇన్‌ఫ్యాక్టరెన్స్ కంపార్టబులిటి కాన్సెప్ట్‌ను విద్యార్థులు తెలుసుకొని వాటిపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. కోఆర్డినేటర్ డాక్టర్ జి.కామేశ్వరరావు మాట్లాడుతూ రాడార్ ఇంజనీరింగ్‌లో వినియోగించే వివిధ సెన్సార్లు, వాటి ధర్మాలు, అనువర్తనాలు మానవాళికి ఏవిధంగా ఉపయోగపడుతుందో తెలుసుకోవడానికి ఇలాంటి ప్రయోగాత్మక శిక్షణా సదస్సులు విద్యార్థులకు ఎంతో తోడ్పాటు అందిస్తాయన్నారు. అనంతరం డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి ప్రయోగాత్మక శిక్షణా సదస్సుల వల్ల భవిష్యత్తులో కోర్‌జాబ్స్ పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.